కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

అబిడ్స్: ప్రజాబలం నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే దానం నాగేందర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు సంతోష్‌గుప్తా, ధన్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతోంది


గౌతమ్‌రావును సన్మానిస్తున్న డిజ్వర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: తెలంగాణ ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకని పలువురు బీజేపీ నాయకులు మంగళవారం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగినా ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గోల్కొండ బీజేపీ ప్రధాన కార్యదర్శి డిజ్వర్‌సింగ్, బీజేపీ నాయకులు అజయ్, రమేష్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆత్రేయ ఆచార్య

చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని శ్రీ బాలాజీ దేవాలయం లో నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యే రాజాసింగ్‌ను దేవాలయ అర్చకులు, ఆత్రేయచార్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలిసిన ఆయన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి 14 వరకు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరగనున్నందున.. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరామన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జియాగూడ: ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జియాగూడ దుర్గానగర్ ప్రాంతంలో విశాఖపట్నానికి చెందిన రాజు (60) ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. రెండు రోజులుగా అతను తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కుల్సుంపురా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులను బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా రాజు కరెంటు కేబుల్ ఎక్సటెన్షన్ బాక్స్ మీద పడి మృతి చెంది ఉన్నాడు. కరెంటు షాక్ కారణంగా మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుమారుడు సాయి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు షురూ..


రంగనాథ స్వామి ఆలయ గోపురం

- ప్రత్యేక ఆకర్శణగా నిలవనున్న రాధాకృష్ణుల బృందావనం సెట్టింగ్
- నెదర్లాండ్ స్నోబాల్స్‌తో అలంకరణ
- ప్రాంగణంలో ఎల్ఈడీ విద్యుత్ దీపాల ఏర్పాటు
- రంగనాథస్వామి, వెంకటేశ్వర లక్ష్మీ, పద్మావతి అమ్మవార్ల ముస్తాబు


గరుడ వాహనానికి తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏటా స్వామివారి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని ఆలయ ప్రతినిధి శేషా చారి తెలిపారు.

బృందావనంలో స్వామి వారి దర్శనం..

జియాగూడ రంగనాథస్వామి ఏటా విభిన్న రూపంలో నగరంలో ఎక్కడ లేని విధంగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ అలంకరణ చూసేందుకే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది రాధాకృష్ణుల ఉయ్యాలా జంపాల, నెమళ్ల సంచారం, నెదర్లాండ్స్ నుంచి తెప్పించిన స్నోబాల్స్‌లో బృందావనాన్ని తీర్చిదిద్దనున్నారు. సాగరంలో శేష శయనంపై వైకుంఠ వాసుడు, శ్రీ మహాలక్ష్మి, గరుడ వాహనంపై వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. ఇందులో భాగంగా ఆలయంలో సప్తద్వారాల తోరణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ద్వారా వద్ద వివిధ దేవత మూర్తులను కొలువుదీర్చారు.


ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

అలరించిన హరివిలాసం

గన్‌ఫౌండ్రీ: అభినయ వాణి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నాట్య మేధ పేరిట మంగళవారం కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. డాక్టర్ వేంపటి చిన్న సత్యం నృత్య నాటకాలను కనుల పండువగా ప్రదర్శించారు. ప్రముఖ గురువు బాలత్రిపుర సుందరి దర్శకత్వంలో హరవిలాసం, ధక్షయజ్ఞం, పార్వతీ కల్యాణం అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినీ నటి మంజుభార్గవి మాట్లాడుతూ.... వేంపటి చిన్న సత్యం ఆశయాలను నేటి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ తడకమళ్ల అనురాధ, మాధవీ లత, రాజేశ్వరీ, మురళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు


ట్రోఫీతో అకాడమిక్ హెడ్ జాస్మీన్ బేగం

గోల్కొండ: విద్యార్థులను వారు ఇష్టపడిన రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని గోల్కొండ ఉర్వా మాడల్ హై స్కూల్ అకాడమిక్ హెడ్ జాస్మీన్ బేగం అన్నారు. ఆల్ ఇండియా నిల్లత్ కౌన్సిల్ ఆధ్వర్యంలోనిర్వహించిన అండర్-15 బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉర్వా హై స్కూల్‌కు చెందిన యూసుఫ్ అలీఖాన్ టీమ్ విజేతగా నిలిచింది. 8 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో అత్యధిక గోల్స్ చేసి యూసుఫ్ అలీఖాన్ బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం యూసుఫ్ అలీఖాన్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో సహనియత్ ఉన్నీసా, తబుస్సుంబేగం, ఫహమీనా ఉన్నీసా తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి


గోల్కొండ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

లంగర్‌హౌస్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కామారెడ్డి ఓబీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ర్యాలీగా గోల్కొండ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు కేటాయించే బడ్జెట్ రెండు సంవత్సరాలకు కలిపి రూ.40 వేల కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్, దేవర వంశి, ఇంద్రసేనా రెడ్డి, నాగేంద్రప్రకాష్ రెడ్డి, భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం



లంగర్‌హౌస్: శ్మశాన వాటికలో ఎట్టకేలకు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌస్ త్రివేణి సంగం స్మశాన వాటికకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఎందరో ప్రముఖుల అస్తికలు నిమజ్జనం చేశారు. బాపు సమాధి కూడా నిర్మించారు. ఇలాంటి స్మశాన వాటికలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఇటీవల ఓ బీజేపీ నాయకుడి తల్లి అంత్యక్రియలు సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ల వెలుగులో నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై సెల్‌ఫోన్ వెలుగుల్లో అంత్యక్రియలు, చారిత్రక శ్మశానం....వసతులు హీనం....శీర్షికతో సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికారులు స్మశానవాటికలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం....

'సాక్షి'కథనాలపై స్పందించిన అధికారులు పలు అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. స్మశాన వాటికలో అదనంగా మరో రెండు నూతన అంత్యక్రియల బర్నింగ్ పాయింట్లను నిర్మించనున్నారు. వచ్చిన వారు కూర్చోడానికి షెడ్డు, టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవియాదవ్, మాతంగి రమేష్, టి.శివ శంకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్వాన్ నియోజకవర్గంలో అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు మీ సేవా కేంద్రంలో గానీ, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి అవసరమైన ధృవపత్రాలన్నిటిని సిద్ధం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి స్టేషన్‌లో డీసీఎం తనిఖీలు

- పార్కింగ్ స్థలాల పరిశీలన
- బయటి తినుబండారాలను అనుమతిస్తే కఠిన చర్యలు

నాంపల్లి: 'సాక్షి' దినపత్రికలో 'నాంపల్లి స్టేషన్ వద్ద నయా దందా' శీర్షికన ప్రచురితమైన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ డివిజన్ డీసీఎం విశాల్ అర్జున్ నాంపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ప్రాంగణంతో పాటు టూ వీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్ ప్రదేశాలను సందర్శించారు. అనంతరం క్యాంటీన్, స్టాల్స్, పార్శిల్ విభాగాలను పరిశీలించారు. రైల్వే స్టేషన్ ఆవరణలోకి బయటి తినుబండారాలు, వాటర్ బాటిల్స్ అనుమతిని నిషేధించాలని ఆదేశించారు. ప్రయాణికులకు ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలను అందజేయాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు బజార్‌లో మురుగు కాలువల నిర్మాణం వద్దు


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా రైతుబజార్‌లో మురుగునీటి పైప్‌లైన్ ప్రతిపాదనలను విరమించుకోవాలని రైతులు అన్నారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఫలక్‌నుమా డివిజన్ నాయకుడు సభావత్ గిరిధర్ నాయక్‌తో కలిసి జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ....ఫలక్‌నుమా రైతు బజార్‌లో రెండు దశాబ్దాలుగా రంగారెడ్డి జిల్లాలోని కందుకూర్, మహేశ్వరం, కడ్తాల్, కేశంపేట, బాలాపూర్ మండలాలకు చెందిన దాదాపు 250 మంది రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటికే ఇరుగ్గా ఉన్న రైతు బజార్‌లో రెండు గేట్‌ల మీదుగా కొత్తగా రెండు పైప్‌లైన్లు వేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రణాళికలు రూపొందించారన్నారు. గత నవంబర్ 22న జీహెచ్ఎంసీ అధికారులు, ఎగువన ఉన్న మదీనా కాలనీ ప్రతినిధులు రైతుబజార్‌కు వచ్చి పైప్‌లైన్ల విషయమై చర్చించారన్నారు. ఇందులో పైప్‌లైన్లు వేసినట్లయితే నిత్యం డ్రైనేజీ లీకై అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుందన్నారు. దీంతో వినియోగదారులు మార్కెట్‌కు రావడం మానుకుంటారన్నారు. బుధవారం రైతుబజార్‌కు వచ్చి స్వయంగా పరిశీలిస్తానని ఈ సందర్భంగా జడ్‌సీ వారికి హామీ ఇచ్చారు. సమస్యను రైతులు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి కూడా తీసుకెళ్లారు. కార్యక్రమంలో రైతులు కుమార్, హరిలాల్, శ్రీను, పార్వతమ్మ, లక్ష్మీ, లలిత తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి రాజీవ్‌గాంధీ అండర్-19 క్రికెట్ లీగ్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ వీహెచ్

గన్‌ఫౌండ్రీ: 47వ అఖిల భారత రాజీవ్‌గాంధీ అండర్-19 2020 లీగ్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మాజీ ఎంపీ వీ హన్మంతరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..... క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలు 21న అంబర్‌పేటలోని వాటర్‌వర్క్స్ మైదానంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రారంభిస్తారని తెలిపారు. అంబర్‌పేటలోని వాటర్‌వర్క్స్ మైదానం, అత్తాపూర్‌లోని విజయానంద్, ఎల్బీస్టేడియంలో పోటీలు జరుగుతాయన్నారు. ముగింపు వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఫెడరేషన్ అధ్యక్షులు ఆది అవినాష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలకు కోవెల రంగనాయక ఆలయం ముస్తాబు

- ఆలయానికి శతాబ్దాల చరిత్ర
- ఆలయ గుండం నీటిలో ఔషధ గుణాలు
- భారీ ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులు


శ్రీ కోవెల రంగనాయక స్వామి ఆలయం

గోల్కొండ: నానల్‌నగర్ తిరుపల్లిగడ్డ సాలార్‌జంగ్ కాలనీలోని శ్రీ కోవెల రంగనాయక స్వామి ఆలయం సంక్రాంతి వేడుకలకు ముస్తాబవుతోంది. రాష్ట్ర దేవాదాయ శాఖ నిర్వహణలో ఉన్న ఈ ఆలయానికి నగరం నుంచే కాకుండా మొయినాబాద్, చేవెళ్ల తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఆలయంలో యేటా సంక్రాంతి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది సైతం వేడుకలను భారీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. ఆలయానికి రంగులు వేయడం, ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసే పనులు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని గుండాన్ని శుభ్రం చేసి భక్తుల స్నానాలకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి వసంత పర్యవేక్షణలో సంక్రాంతి వేడుకల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి.

హోమ గుండాలే కోనేరులు


ఆలయ గుండం

సప్త రుషులు నిర్మించిన హోమ గుండాలే కాలక్రమంలో రెండు కోనేరులుగా మారినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. సప్త రుషులు లోక కళ్యాణం కోసం భగవంతుడిని ప్రార్థిస్తూ యాగాలు చేయడంతో ప్రసన్నమైన శ్రీ రంగనాయక స్వామి వైశాఖ శుద్ధ చతుర్థశి రోజున స్వాతి నక్షత్రంలో సాయం సంధ్యాసమయంలో జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చారని, అందుకు నిదర్శనంగానే ఈ ప్రదేశంలో శ్రీ రంగనాయక స్వామిని ప్రతిష్ఠించారని ఆలయ చరిత్ర స్పష్టం చేస్తుంది. ఆలయం ఎదురుగా తొమ్మిది అడుగుల రాతి ధ్వజస్తంభం ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా. ఆలయ ప్రాంగణంలో ఉన్న వృక్షానికి ముడుపులు కట్టుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం.

గుండం ప్రత్యేకం...

ఆలయ గుండంలో ఉన్న స్వచ్ఛమైన నీటికి ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ గుండంలో స్నానాలు చేస్తే రోగాల నుంచి నివారణ పొందుతామని భక్తుల నమ్మకం. మందులతో నయం కాని వ్యాధులు సైతం ఈ గుండలో స్నానం చేస్తే నయం అవుతాయి. ఈ గుండంలో స్నానం చేసి గుడి చెట్టు ఐదు సార్లు ప్రదక్షిణలు చేసి పూజలు చేస్తే కష్టాలు దూరమై కోరికలు నెరవేరతాయని భక్తుల నమ్మకం.

13 నుంచి సంక్రాంతి వేడుకలు...

ఈ నెల 13 నుంచి సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వసంత తెలిపారు. 13న ప్రారంభమయ్యే వేడుకలు 15న ముగుస్తాయని తెలిపారు. అదే విధంగా ఈ వేడుకల్లో రంగోలి పోటీలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

ముగిసిన హైదరాబాద్ సూపర్ లీగ్ యూత్ కప్


గెలుపొందిన క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ లిటిల్ స్టార్స్ సాకర్ అకాడమీ శ్రీనిధి దక్కన్ సంయుక్త ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన హైదరాబాద్ సూపర్ లీగ్ యూత్ కప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా లిటిల్‌స్టార్స్ సాకర్ అకాడమీ సీఈఓ మహ్మద్ ఫైజ్‌ఖాన్ మాట్లాడుతూ.... అట్టడుగు స్థాయిలో ఉన్న ఫుట్‌బాల్ క్రీడను అభివృద్ధి చేస్తూ ఔత్సాహిక యువ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు ఈ వేదిక దోహదపడుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన

నాంపల్లి: ఐకమత్యంతోనే నాయీ బ్రాహ్మణుల హక్కులను సాధించుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ అడిషనల్ కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ అన్నారు. మంగళవారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం నూతన సంవత్సరం కేలండర్-2025 ఆవిష్కరణ సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీఎల్ఎన్ గాంధీ, సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎల్.రాంబాబుతో కలిసి కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు సంఘటితం కావాలన్నారు. దేవరకొండ నాగరాజు మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకమండలిని ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సెలూన్స్‌కు విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖ వేధింపులను అరికట్టాలన్నారు. సెలూన్స్ ఏర్పాటుకు లైసెన్సులను మంజూరు చేయాలన్నారు. 50 ఏళ్ల వయస్సు నిండిన నాయీ బ్రాహ్మణులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. నాయీ బ్రాహ్మణ ఆత్మ గౌరవ భవన స్థలానికి ప్రహరీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయ పాలక మండలిలో ఒక నాయీ బ్రాహ్మణుడికి నామినేటెడ్ సభ్యుడిగా తీసుకునే సాంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు సుధాకర్, ప్రధాన కార్యదర్శి రామచందర్, కె.హరినాథ్, జయ ప్రభ, ఎస్.లక్ష్మీనారాయణ, చౌటకూర నగేష్, ఎం.గురప్ప, ఎస్.భూపాల్ రాజ్, తొలిచుక్క మాధవి, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఐలాండ్ కూల్చివేత

గోల్కొండ: అధికారులు తమ పొరపాటును సరిదిద్దుకున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు చౌరస్తాను అందంగా తీర్చిదిద్దేందుకు బల్దియా, ట్రాఫిక్ అధికారులు గత వారం సెవన్ టూమ్స్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఐ లాండ్ నిర్మించారు. అయితే ఈ ఐలాండ్ నడిరోడ్డుపై కాకుండా కొద్దిగా పక్కకు ఉండడంతో పాటు రోటరీ ఎత్తు కూడా అవసరానికంటే ఎక్కువగా ఉండటంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు ఎదురు నుంచి వస్తున్న వాహనాలు ఎత్తుగా ఉన్న ఐలాండ్ కారణంగా కనపడవని వాహనాదారులు ఐలాండ్ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.సుధాకర్ సదరు ఐలాండ్‌ను పరిశీలించారు. ఐలాండ్‌ను మొత్తాన్ని కూల్చేసి చౌరస్తా మధ్యలో నిర్మించి దాన్ని ఎత్తును కూడా తగ్గించాలని సూచించడంతో మంగళవారం ఐలాండ్‌ను కూల్చివేశారు.